ఇందిరాపార్క్‌లో 31న తెలంగాణ మార్చ్

లాలాపేట: వక్ఫ్ చట్టాన్ని నిరసిస్తూ ఈనెల 31న తెలంగాణ మార్చ్ నిర్వహించనున్నట్లు సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ సింహాద్రి తెలిపారు. ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందుకు సంబందించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ మీర్జా మజరుల్లా బేగ్, రిజ్వాన్ ఉస్సేన్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన



భరత్‌నగర్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికారులు

ముషీరాబాద్: భరత్‌నగర్‌లో అధ్వానంగా మారిన నేపథ్యంలో రూ.18 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించామని కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ తెలిపారు. నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ, మంచినీటి పైపులైన్లను ఆధునీకరిస్తున్నామని అన్నారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.నవీన్‌గౌడ్, లక్ష్మణ్, వెంకటేష్, బాలకృష్ణ, కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కిందపడి ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం... గుర్తు తెలియని వ్యక్తి (40) జామై ఉస్మానియా – ఆర్ట్స్ కాలేజ్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాలాల్లో పూడికను త్వరితగతిన తొలగించాలి



అశోక్‌నగర్ స్ట్రీట్ నం.2 వద్ద నాలాలలో చేపడుతున్న పూడిక పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని, అధికారులు

చిక్కడపల్లి: రానున్న వర్షాకాలం దృష్ట్యా నాలాల్లో పేరుకుపోయిన పూడికను త్వరితగతిన తొలగించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. బుధవారం అశోక్‌నగర్ స్ట్రీట్ నం.2 వద్ద నాలాల్లో చేపడుతున్న ఆమె పరిశీలించి మాట్లాడారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరకుండా పూర్తిస్థాయిలో కూడికను తొలగించాలని సూచించారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. డివిజన్‌లో ఏదైన సమస్య తలెత్తితే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని ప్రజలు కోరారు. వీలైనంత త్వరగా ఆ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ అబ్దుల్ సలాం, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, శ్రీకాంత్, పండారి నర్సింగ్‌రావు, వడ్డేపల్లి ఆనంద్‌రావు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టండి



ఇటీవల కురుస్తున్న వర్షాలకు గాంధీనగర్‌లోని రోడ్లు అధ్వాన్నంగా మారాయి. ప్రధానంగా అశోక్‌నగర్ చౌరస్తా నుంచి నారాయణగూడ వెళ్లే దారిలో ఓ అడుగు గుంతపడి ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. – చిక్కడపల్లి

వీర్ సావర్కర్ సేవలు చిరస్మరణీయం

ఘనంగా వినాయక్ దామోదర్ దాస్ సావర్కర్ జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు

కాచిగూడ: ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు వినాయక్ దామోదర్ దాస్ (సావర్కర్) వీర్ సావర్కర్ చరిత్ర ప్రతి భారతీయుడు తెలుసుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్ అన్నారు. వీర్ సావర్కర్ జయంతిని పురస్కరించుకొని బుధవారం కాచిగూడ చౌరస్తాలోని వీర్ సావర్కర్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... స్వాతంత్య్ర పోరాటంలో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సావర్కర్ రాసిన పుస్తకాలు, ఆయన జీవితంపై తీసిన సినిమాలు చూస్తే ఆయన చేసిన త్యాగాలు తెలుస్తాయని అన్నారు. నేటి యువత సావర్కర్ గురించి తెలుసుకుని ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ ఎస్.గౌతంరావు, ఎ.సూర్యప్రకాష్ సింగ్, బి.భీమ్‌రాజ్, వాసు, సుభాష్ పటేల్, ఆర్.సంతోష్, బాలప్రసాద్, రమేష్, పంకజ్, మిలింద్ బిడే, సూరి, అజయ్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సావర్కర్ చరిత్రను తెలుసుకోవాలి..

వీర్ సావర్కర్ దేశానికి చేసిన సేవలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని భజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు అన్నారు. వీర్ సావర్కర్ జయంతి సందర్భంగా బుధవారం కాచిగూడలోని వీర్ సావర్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వీర్ సావర్కర్ లాంటి గొప్ప దేశ భక్తుడి త్యాగాలు, దార్శనికతను మనం ఎల్లప్పుడు గుర్తించుకోవాలని సూచించారు.



కాచిగూడ చౌరస్తాలోని వీర్ సావర్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్

సురక్షిత నీరు అందించడమే లక్ష్యం

- శిథిలావస్థకు చేరిన సీవరేజీ పైప్‌లైన్ స్థానంలో కొత్తవి వేస్తున్నాం
- కలుషిత తాగునీటి సరఫరాకు చెక్ పెట్టేందుకు పైప్‌లైన్ పనులు
- నర్సింహబస్తీలో పాదయాత్ర చేసి నేరుగా సమస్యలు తెలుసుకున్నా
- అంబర్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



సీవరేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత

నల్లకుంట: అంబర్‌పేట నియోజకవర్గంలోని ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. దశాబాల క్రితం ఏర్పాటు చేసిన సీవరేజీ పైపులకు లీకేజీలు ఏర్పడటంతో కలుషిత తాగునీరు సరఫరా అవుతోందని ఆయన తెలిపారు. కలుషిత తాగునీటి సరఫరాకు చెక్ పెట్టాలంటే కొత్తగా సీవరేజీ పైపులు వేయాలని నిర్ణయించుకున్నామని అన్నారు. బుధవారం నర్సింహబస్తీలో రూ.45లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు, సీవరేజీ పైపులైన్ పనులకు ఆయన కార్పొరేటర్ అమృతతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే బస్తీలో పాదయాత్ర చేసి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా బస్తీలో చాలా ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగడం లేదన్నారు. బస్తీలో కొత్తగా వేస్తున్న సీవరేజీ పైపులను అన్ని వీధుల్లో వేయాలని కోరారు.



నర్సింహ బస్తీలో పాదయాత్ర చేసి స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

- ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటానని చెప్పారు. నర్సింహబస్తీ అంతర్గత వీధులు గంతలమయంగా మారాయని అన్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన సీవరేజీ పైపులు శిథిలావస్థకు చేరి తాగునీరు కలుషితం అవుతోందన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు సిద్ధం చేయించి పనులకు శ్రీకారం చుట్టానన్నారు. డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదే సమయంలో అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అలాగే ఆయా బస్తీలు, కాలనీలలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని అన్నారు.
- ఈ కార్యక్రమంలో నర్సింహబస్తీ అధ్యక్షుడు ఎం. భూపతినాథ్, కార్యదర్శి శ్రీనివాస్, జలమండలి డీజీఎం విష్ణువర్ధన్, శివం సెక్షన్ మేనేజర్ రోహిత్, జీహెచ్ఎంసీ డీఈఈ ప్రవీణ్, ఏఈ ప్రశాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మేడి ప్రసాద్, సాయిని మూర్తి, ఇర్ఫాన్ సుల్తానా, వన్నాడి రమ్య, గోనే ప్రదీప్‌రావు, సీహెచ్. సాయిమోహన్, కేజే. బాబు, ఎంబీ. కిషోర్‌కుమార్, ప్రశాంత్ జోషి, మంగిశివ, మధుసూదన్, మధుయాదవ్, బస్తీవాసులు పాల్గొన్నారు.

ఫీవర్‌లో ఫార్మసీ ఆఫీసర్ల సంబురాలు

ఫార్మసిస్ట్ గ్రేడ్–2 హోదాను ఫార్మసీ ఆఫీసర్‌గా మార్చడంపై హర్షం



ఫీవర్‌లో కేక్ కట్ చేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రాజేంద్రప్రసాద్, సీఎస్ ఆర్ఎంవో డా. జయలక్ష్మి

నల్లకుంట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ఫార్మసిస్ట్ గ్రేడ్–2 హోదాను ఫార్మసీ ఆఫీసర్‌గా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీవో జారీ చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో ఫార్మసీ ఆఫీసర్ ఉమాదేవి ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ చాంబర్‌లో ప్రొ. డాక్టర్ ఎస్.రాజేంద్రప్రసాద్, సీఎస్ ఆర్ఎంవో డా. జయలక్ష్మి, డీసీ ఆర్ఎంవో విజయలక్ష్మితో కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫార్మసీ సేవలు అందించే వారిని ఫార్మసిస్టులు అనే వారన్నారు. ప్రభుత్వం జారీ చేసిన కొత్త జీవోతో వారికి ఫార్మసీ ఆఫీసర్ హోదా వచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ ఆఫీసర్లు ఉమాదేవి, గ్లోరి, మోనిక, నళిని, శ్రీతేజ, విజయకల, లావణ్య, కీర్తి, ఉమ, రాఘవేంద్ర, సురేష్, పాల్, జయ, గోపి, నవనీత, శ్రీకాంత్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచుతూ జీఓ జారీ చేయాలి



కాచిగూడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జ సత్యం, నీలం వెంకటేష్

కాచిగూడ: బీసీలకు 42 శాతం బీసీ రిజర్వేషన్లు పెంచుతూ జీఓ జారీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. లేని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీసీలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని ఆయన హెచ్చరించారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరపడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు ప్రభుత్వవర్గాల ద్వారా తెలుస్తోందన్నారు. ఓసారి 42శాతం రిజర్వేషన్లు పెంచుతామని మరోసారి మరోసారి పార్టీ పరంగా 42శాతం టికెట్లు ఇస్తామని ప్రకటనలు చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లు పెంచే విషయంలో ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. పార్టీ పరంగా టికెట్లు వద్దు.. ఆ భిక్షం మాకొద్దని అన్నారు. బీసీలకు గౌరవప్రదమైన, న్యాయమైన హక్కు కావాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం టికెట్లు ఇస్తామని చేసే ప్రకటనలు మానుకోవాలని హితవు పలికారు. రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. ఆ విషయాన్ని కేంద్రంపై నెట్టి తప్పించుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, సూర్యనారాయణ, జానయ్య, జెల్ల నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తి చేయించండి

- వాటర్‌వర్క్స్ ఎండీకి డాక్టర్ ఎన్.గౌతంరావు వినతి

నల్లకుంట: నల్లకుంట మయూరి లేన్‌లో నెల రోజుల క్రితం డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను చేపట్టారు. పనులు 70 శాతం పనులు పూర్తయ్యాయి. ఆ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ అనారోగ్యంతో మృతి చెందడంతో మిగతా 30 శాతం పనులు నిలిచిపోయాయని అన్నారు. రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతో స్థానికులు ఈ విషయాన్ని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ బుధవారం గౌతంరావుతో కలిసి మయూరి లేన్‌లో పర్యటించారు. నిలిచిపోయిన డ్రైనేజీ పైపులైన్ పనులను పరిశీలించారు. అనంతరం వాటర్‌వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డిని నారాయణగూడలోని ఆయన కార్యాలయంలో కలిశారు. సమస్యను ఆయనకు మిగిలిన పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయించాలని కోరారు. ఎండీని కలిసిన వారిలో బీజేపీ నాయకులు శ్యామ్‌రాజ్, ఎస్. రాంజగదీష్ ముదిరాజ్, కేజే బాబు, ఎంబీ కిషోర్ కుమార్, ప్రశాంత్‌జోషి, మధుయాదవ్, మంగి శివ, మయూరి లేన్ వాసులు పాల్గొన్నారు.



మయూరి లేన్‌లో పర్యటించి సమస్యను తెలుసుకుంటున్న బీజేపీ నేత డాక్టర్ ఎన్.గౌతంరావు



వాటర్‌వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డితో మాట్లాడుతున్న డా. గౌతంరావు

డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయాలి



సత్యనగర్‌లో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలని జీహెచ్ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్లను ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశించారు. బుధవారం అడిక్‌మెట్ డివిజన్‌లోని సత్యానగర్, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్‌లో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడప సురేందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ విజయోత్సవ సభను జయప్రదం చేయాలి

ముషీరాబాద్: వరంగల్‌లో ఈ నెల 31న జరిగే ఎమ్మార్పీఎస్ విజయోత్సవ సభ, జాతీయ సమావేశాన్ని జయప్రదం చేసేందుకు ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు గండి కృష్ణమాదిగ విజ్ఞప్తి చేశారు. బుధవారం ముషీరాబాద్‌లోని భారత్ సేనా సమాజ్ కమ్యూనిటీహాల్‌లో ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్యనాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గండి కృష్ణమాదిగ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణకై అలుపెరుగని పోరాటం చేసిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ విజయోత్సవ సభకు ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రోషన్, వినాయకరావు, నాయకులు శ్రీకాంత్, ఎల్లయ్య, దశరథ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు గండి కృష్ణమాదిగ

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వండి

- ఈపీడీసీ అధ్యక్షుడు రంగయ్య



కాచిగూడ: 'విశ్వనగరం.. స్వచ్ఛ నగరం'గా ప్రకటించిన హైదరాబాద్ మహానగరం ఇప్పుడు చెత్తకుప్పలతో అస్తవ్యస్తంగా మారిందని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఈపీడీసీ) అధ్యక్షుడు రంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. అధికారులు స్వచ్ఛ హైదరాబాద్ గురించి మాట్లాడుతున్నారు కానీ నిజానికి ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, దుర్గంధం కనిపిస్తోందని అన్నారు. జీహెచ్ఎంసీ ఇంటింటికీ తడి, పొడి చెత్త సేకరణ వ్యవస్థను ప్రవేశ పెట్టినప్పటికీ అమలులో పూర్తిగా విఫలమవుతోందని పేర్కొన్నారు. ఇది పర్యావరణ చట్టాల ఉల్లంఘనేనని ఆయన స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణకు కఠిన చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. ప్రస్తుతం ఈ చలాన్ వ్యవస్థ ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు బలహీనంగా ఉందన్నారు. ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చినప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.

ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల ఫీజులు పెంచొద్దు



ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణరెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల ఫీజులు పెంచొద్దని డీవైఎఫ్ఐ డిమాండ్ చేసింది. బుధవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ. వి.బాలకృష్ణరెడ్డి, వైస్‌చైర్మన్ ప్రొ. ఇటిక్యాల పురుషోత్తంకు డీవైఎఫ్ఐ నేతలు వినతి పత్రం సమర్పించారు. విద్య వ్యాపారమే ప్రధాన లక్ష్యంగా కళాశాలలు నడుస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రతిఏటా లక్షల్లో ఫీజులు పెంచుతూ పేద విద్యార్థుల తల్లిదండ్రులపై భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేవారు. ఖర్చులు పెరుగుతున్నాయనే సాకుతో అత్యధికంగా ఫీజులు పెంచడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటా రమేష్, కార్యదర్శి అనగంటి వెంకటేష్, నాయకులు ఎండీ జావేద్, రాజు తదితరులు ఉన్నారు.

అహల్యాబాయి హోల్కర్ సేవలు ప్రజలకు తెలియాలి



పూజలో మహిళా మోర్చా మహంకాళి జిల్లా అధ్యక్షురాలు అనిత, కార్పొరేటర్ సుప్రియ

ముషీరాబాద్: సామాజిక సమానత్వం కోసం అహల్యాబాయి హోల్కర్ ఎంతో కృషి చేశారని మహిళా మోర్చా మహంకాళి జిల్లా అధ్యక్షురాలు అనిత అన్నారు. పుణ్యశ్లోక, లోకమాత అహల్యాబాయి హోల్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. బుధవారం మహిళా మోర్చా భోలక్‌పూర్ డివిజన్ కమిటీ అధ్యక్షురాలు జ్యోతి ఆధ్వర్యంలో దేవునితోటలోని భవానీశంకర ఆలయంలో స్వామి వారికి మహా హారతి, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ... అహల్యాబాయి హోల్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రధాని మోదీ పని చేస్తున్నారని అన్నారు. ఆమె అందించిన సేవలను దేశ ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంగ, మాధవి, లక్ష్మి, పద్మజ, రాణి, బద్రీనారాయణ, రమేష్‌రాం, ఆర్.విశ్వం, బిజ్జి కనకేష్‌కుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి



కార్మిక కమిషనర్ కార్యాలయం వద్ద అన్నదానం చేస్తున్న లక్ష్మణ, శివరావు

చిక్కడపల్లి: ఆకలితో ఉన్న వారికి పట్టెడన్నం పెడితే మానవ జన్మకు సార్ధకత లభిస్తుందని చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చేపూరి లక్ష్మణ్ అన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీక్రాస్ రోడ్డులో కార్మిక కమిషనర్ కార్యాలయం సమీపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేపూరి లక్ష్మణ్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు శివరావు, ప్రసాద్‌రావు, రమేష్, రవీందర్, బాలచందర్, శ్రీనివాస్, భిక్షపతి, సురేందర్‌గుప్తా, రామ్మూర్తి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణమూర్తికి ఎన్టీఆర్ రంగస్థల పురస్కారం



తుర్లపాటి రాధాకృష్ణమూర్తికి పురస్కారం ప్రదానం చేస్తున్న కేవీ రమణాచారి

చిక్కడపల్లి: ఎన్టీఆర్ ఉన్నత వ్యక్తిత్వం కలిగిన మహనీయుడని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో బుధవారం త్యాగరాయ గానసభలో ఎన్టీఆర్ రంగస్థల పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ రంగస్థల నటుడు తుర్లపాటి రాధాకృష్ణమూర్తికి పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. తెలుగు సాహిత్యం, సంస్కృతి పట్ల అభిమానమున్న ఎన్టీఆర్ పేరిట తుర్లపాటికి పురస్కారాన్ని ప్రదానం చేయడం సముచితంగా ఉందన్నారు. ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ... పౌరాణిక సినిమాలలో పాత్రోచితంగా నటించి మెప్పించిన ఎన్టీఆర్ గొప్ప కళాపోషకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ముక్తేశ్వరరావు, సుబ్బరాయశర్మ, రామకోటేశ్వరరావు, మద్దాలి రఘురాం, లక్ష్మి, మణిశాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.